క్లుప్తంగా

సమాచారం

అల్వాల్ సర్కిల్ పరిధిలోని అల్వాల్ గ్రంథాలయం వద్ద బుధవారం వారాంతపు సంత(రైబజార్) నిర్వహిస్తారు.

వైద్య సేవలు

అల్వాల్, మల్కాజిగిరి, మౌలాలి ప్రభుత్వ ఆస్పత్రుల్లో బుధవారం గర్భిణుల నమోదు, చికిత్సలు, జనరల్ పరీక్షలు, హోమియో వైద్యం నిర్వహిస్తారు.

కరెంటు ఉండని ప్రాంతాలు

ఉప్పల్: ఉప్పల్ బగాయత్ 11కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉప్పల్ బగాయత్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు.

బడ్జెట్‌లో విద్యా రంగాన్ని విస్మరించారు



ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్‌కుమార్

కాప్రా: విద్యార్థుల ఆత్మబలిదానాలతో తెచ్చుకున్న తెలంగాణలో విద్యారంగం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతోందని ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. రెండేళ్లుగా రూ.3,500 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మన ఊరు – మన బడి కార్యక్రమానికి నిధుల కేటాయింపు మాటే లేకపోవడంతో తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు. బడ్జెట్‌లో 30శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని, ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని స్పష్టం చేశారు.

వంశరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గోపాల్



రామంతాపూర్: వంశరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రామంతాపూర్‌కు చెందిన పాయసం గోపాల్‌ను రాష్ట్ర గౌరవాధ్యక్షులు గంధం సత్యనారాయణ వంశరాజ్, మురళీకృష్ణ వంశరాజ్ నియమించారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన గోపాల్ పదవీ ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గొంగిడి సునీతరెడ్డి, మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌తో పాటు వంశరాజ్ సంఘం ప్రతినిధులు కృష్ణయ్య, బాలస్వామి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్



కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్

మౌలాలి: ఓల్డ్ సఫిల్‌గూడలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ప్రిన్సిపల్ వై.జాన్ సురేష్ బాబు ఆధ్వర్యంలో మంగళవారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్కూల్ విద్యార్థులు పలు రకాల వంటకాలను ప్రదర్శించి మెప్పించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

శామీర్‌పేట్: కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ఆంజనేయులు అన్నారు. మంగళవారం మూడుచింతలపల్లి మండలం, లక్ష్మాపూర్ గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వైద్యనాథ్, కార్యదర్శి శోభారాణి, ఆశా వర్కర్ మంజుల, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం పరిశీలన

ఘట్‌కేసర్: ప్రతి ఒక్కరూ కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని ఉప సర్పంచ్ ఐలయ్యయాదవ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొండల్‌రెడ్డి సూచించారు. అవుషాపూర్‌లో కంటి వెలుగు–2 కార్యక్రమాన్ని మంగళవారం వారు పరిశీలించారు. గ్రామంలో 550 మంది కంటి పరీక్షలు చేయించుకోగా 100 మందికి కళ్లద్దాలు అందజేశారు. రైతుబంధు జిల్లా సభ్యుడు భిక్షపతిగౌడ్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



కళ్లద్దాలు అందజేస్తున్న ఐలయ్య, కొండల్‌రెడ్డి

ఆహ్లాదం



ఆహ్లాదకరంగా జ్యోతినగర్ పార్కు

గౌతంనగర్: తరలిరాద తనే వసంతం.. తన దరికి రాని వనాల కోసం.. అంటూ ఓ సినీ కవి ప్రకృతి గొప్పదనాన్ని అందంగా వివరించాడు. నగరం కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న తరుణంలో అక్కడక్కడా ఉన్న ఉద్యానవనాలు స్థానికులకు కాస్త ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని పంచుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు బిజీగా గడుపుతున్న నగరవాసులకు సాయంత్రం పూట పార్కులు ఉపశమనం కలిగిస్తున్నాయి. నిత్యం ఎన్నో ఒత్తిళ్లతో సతమతమవుతూ గంటల తరబడి కంప్యూటర్ స్క్రీన్లకు అతుక్కుపోతున్న వారికి ప్రశాంతతను ఇస్తున్నాయి. ఇరుకు ఇళ్లలో గంటల తరబడి ఇంటి పనుల్లో మునిగితేలుతున్న మహిళలకు పచ్చని పార్కులు ఉత్సాహాన్ని నింపుతున్నాయి. సమయం దొరికిన వారు ఉదయం, మరికొంత మంది సాయంత్రం పూట పార్కుల్లో గడుపుతుండటంతో స్థానికంగా ఉన్న పార్కులు కళకళలాడుతున్నాయి. పార్కుల అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుండటంతో అసౌకర్యాలు లేకుండా హాయినిస్తున్నాయి.

- జ్యోతినగర్ కాలనీలోని ప్రధాన రహదారి పక్కన స్థలంలో పార్కును ఏర్పాటు చేశారు. అలాగే గౌతంనగర్ కాలనీలో ఉన్న చాచా నెహ్రూ పార్కులో జీహెచ్ఎంసీ అధికారులు అన్ని సదుపాయాలు కల్పించారు. ఈ పార్కులో ఉదయం సాయంత్రం వేళలో సీనియర్ సిటిజన్లు, చిన్నారులు, మహిళలు వాకింగ్‌తో పాటు వ్యాయామం చేస్తున్నారు.



జ్యోతినగర్ పార్కులో వాకింగ్ ట్రాక్

ఘనంగా బన్నాల ప్రవీణ్ జన్మదిన వేడుకలు



బన్నాల ప్రవీణ్ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తదితరులు

ఉప్పల్: బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు అభిమానుల కోలాహలం మధ్య మంగళవారం ఘనంగా జరిగాయి. ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు దేవేందర్‌రెడ్డి, స్వర్ణరాజ్, స్థానిక నాయకులు ఆకుల మహేందర్, వేణుగోపాల్‌రెడ్డి, ఓంకార్‌సింగ్, అరటికాయల భాస్కర్, స్థానిక కాలనీ సంఘాల పెద్దలు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌లో బీఆర్ఎస్ పథకాలతో పాటు డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి ప్రచారం చేయడం పలువురిని ఆకట్టుకుంది.

భరత్‌నగర్ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక



ఉప్పల్ భరత్‌నగర్ కాలనీ నూతన కార్యవర్గం

ఉప్పల్: ఉప్పల్ భరత్‌నగర్ సంక్షేమ సంఘం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భోరంపేట రవి, ఉపాధ్యక్షుడిగా గౌరిగే ఐలేష్, ఉల్పా శ్రీకాంత్, తెల్కల వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆకుల రుషికేష్, కార్యదర్శిగా కావలి హరికృష్ణ, కార్యనిర్వహణ కార్యదర్శి బూత్కూరి నవీన్‌గౌడ్, అరిటికాయల సాయి, కోశాధికారిగా ఎర్ర శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. గ్రామ పెద్దలు పోగుల దయాకర్‌రెడ్డి, రావుల బాలకృష్ణగౌడ్, ఈగ అంజయ్య, చిందం వెంకటేష్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని వినతి



అల్వాల్ మండల అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

అల్వాల్: అల్వాల్ మండల పరిధిలోని యాప్రాల్ సర్వే నంబర్–171లో ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్న భూకబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్.బాలమల్లేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సీపీఐ పార్టీ శ్రేణులు అల్వాల్ మండల అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాప్రాల్‌లోని సర్వే నంబర్–171లో 8 ఎకరాల 12 గుంటల భూమి ఉందన్నారు. ఆ భూమిని పరిరక్షించాలని కోరారు. ప్రభుత్వ భూమి అని బోర్డులు సైతం ఏర్పాటు చేసినా ఇటీవల కొంతమంది భూకబ్జాదారులు ఆ భూమిలో బోర్డును తొలగించి మట్టికుప్పలను తొలగిస్తూ కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇటీవల మండల తహసీల్దార్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అయినా కబ్జాదారులు భూకబ్జాకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని కోరారు. లేదంటే పేదల చేత గుడిసెలు వేయిస్తామన్నారు. ఇళ్లులేని పేదలకు గుడిసెలు వేయిస్తామన్నారు. ఇందుకు ప్రభుత్వం సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కె.సహదేవ్, తోటపల్లి శంకర్, సల్మాన్ బేగ్, చంద్రయ్య, విజయరెడ్డి తదితరులు ఉన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తాం



ఉప్పల్ ప్రెస్‌క్లబ్ డైరీని ఆవిష్కరిస్తున్న మల్కాజిగిరి ఏసీపీ నరేష్‌రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్: జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు పార్టీలకు అతీతంగా కృషి చేస్తామని వివిధ పార్టీల నేతలు, కాలనీ సంఘాల నాయకులు, ఉప్పల్ పట్టణ పెద్దలు హామీ ఇచ్చారు. ఉప్పల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఉప్పల్ మేకల భారతి గార్డెన్‌లో మంగళవారం నిర్వహించారు. మల్కాజిగిరి ఏసీపీ నరేష్‌రెడ్డి, ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బండారి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు కందికంటి అశోక్‌కుమార్ గౌడ్, దుబ్బ నర్సింహారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్, మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న నాగేశ్వర్‌రావు, సీపీఎం నాయకులు కోమిటి రవి, మేకల మధుసూదన్‌రెడ్డి హాజరై డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు నేతలు అధికారులు, సామాజికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠధామంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం

ఘట్‌కేసర్: వైకుంఠధామంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చైర్ పర్సన్ పావనీయాదవ్ అన్నారు. మున్సిపాలిటీ 1వ వార్డులో నిర్మిస్తున్న వైకుంఠధామం పనులను వైస్ చైర్మన్ మాధవరెడ్డి, ఏఈ నరేశ్‌తో కలిసి మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. వైకుంఠధామంలో మహిళలు, పురుషులకు వేర్వేరు స్నానం గదులు నిర్మించాలని, నీటి సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న చైర్ పర్సన్ పావనీయాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

హబ్సిగూడ: ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన పలువురికి మంగళవారం హబ్సిగూడలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం అన్నారు. కార్పొరేటర్ ప్రభుదాస్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుధాకర్, ముత్యంరెడ్డి, కృష్ణారెడ్డి, రాజు, నర్సింహా, రాజు తదితరులు పాల్గొన్నారు.


పరిశ్రమల్లో ప్రమాదాలపై కార్మికులకు అవగాహన

మేడ్చల్‌రూరల్: తమ కంపెనీలో పనిచేసే కార్మికుల శ్రేయస్సుకు యాజమాన్యాలు చొరవ తీసుకోవాలని మేడ్చల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి సూచించారు. మేడ్చల్ పారిశ్రామికవాడలోని షీలా ఫోమ్ కంపెనీలో ప్రథమ చికిత్స, ప్రమాదాల నివారణ, ప్రమాదాలు జరిగినప్పుడు ఏం చేయాలనే దానిపై ఈఎంఆర్ఐ సహకారంతో పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. కార్మికులు ప్రమాదాలకు గురికాకుండా యాజమాన్యాలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రమాదవశాత్తు కార్మికులు గాయపడితే చేయాల్సిన ప్రథమ చికిత్సల గురించి వివరించారు. మేడ్చల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ నర్సింహారెడ్డి, పోలీస్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

జీవో నం.58, 59 దరఖాస్తులపై నేడు అవగాహన

జవహర్‌నగర్: జీవో నంబర్ 58, 59 ప్రకారం దరఖాస్తులు చేసుకున్న వారి కోసం బుధవారం జవహర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి కీసర ఆర్డీవో రవి, కాప్రా మండల తహసీల్దార్ అనిత హాజరై నగదు చెల్లింపులపై సందేహాలను నివృత్తి చేయనున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు ప్రజలు ఉదయం 9.30 గంటలకు జవహర్‌నగర్ తహసీల్దార్ మీటింగ్ హాల్‌కు రావాలని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ తెలిపారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



మేడ్చల్: మండలంలోని శ్రీరంగవరం గ్రామంలో మల్లన్న గుడి నిర్మాణం కోసం గ్రామస్థులు భూమి పూజ చేశారు. జెడ్పీటీసీ శైలజారెడ్డి, సర్పంచ్ విజయానంద్‌రెడ్డి గ్రామస్థులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామస్థుల సహకారంతో ఆలయ నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చూస్తానని జెడ్పీటీసీ శైలజారెడ్డి అన్నారు.

'సుకన్య సమృద్ధి యోజన'ను సద్వినియోగం చేసుకోండి

ఘట్‌కేసర్: సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ సికింద్రాబాద్ సబ్ డివిజన్ అధికారి శ్రీనివాస్‌నాయక్ అన్నారు. ఘట్‌కేసర్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 9, 10 తేదీల్లో పోస్టాఫీసుల్లో రూ.250తో ఖాతా తెరవాలని సూచించారు. ఆడపిల్లలు ఉన్న తల్లిదండ్రులు ఈ పథకంలో చేరితే వారి వివాహానికి ఆసరాగా ఉంటుందన్నారు. 15 ఏళ్ల పాటు నగదు చెల్లించాలని, మరో 6 సవత్సరాల తర్వాత వడ్డీతో పాటు చెల్లిస్తామన్నారు. పుట్టిన రోజు సర్టిఫికెట్‌తో పాటు తల్లి లేదా తండ్రి ఆధార్ కార్డు, పాన్ కార్డు, రెండు ఫొటోలతో పోస్టాఫీస్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

అభివృద్ధి పనులు షురూ..



సఫిల్‌గూడ చెరువులో పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.20 లక్షలతో సఫిల్‌గూడ చెరువులో గుర్రపు డెక్క తొలగించడం, అవుట్‌లెట్ వైపు ఉన్న పైపులైన్లలో పూడిక తొలగించే పనులతో పాటు ఇతర పర్యవేక్షణ పనులు చేపడతామన్నారు. విష్ణుపురి ఎక్స్‌టెన్షన్‌లో రూ.42 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మార్కింగ్ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఈ మహేష్, ఏఈ మధురిమ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, సాయిపటేల్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా పనులు చేపడతాం



రాఘవేంద్రనగర్ కాలనీవాసులతో మట్లాడుతున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని అభివృద్ధి పనులను దశలవారీగా చేపడతామని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అన్నారు. నాచారం రాఘవేంద్రనగర్ కాలనీలో జలమండలి అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి మంగళవారం కార్పొరేటర్ పర్యటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. త్వరలోనే సీసీ రోడ్డు వేయనున్నట్లు తెలిపారు. కలుషిత నీరు వస్తుండటంతో పైప్‌లైన్ మార్చాలని జలమండలి అధికారులను ఆదేశించారు. జలమండలి మేనేజర్ సందీప్, ఏఈ లింగారావు, వర్క్‌ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ నేతలు అశ్వత్థామరెడ్డి, ప్రీతిరెడ్డి, కట్ట బుచ్చన్న, అబిద్ మిర్జా తదితరులు పాల్గొన్నారు.

జోష్‌గా కాంగ్రెస్ జోడో యాత్ర

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని కామాక్షిపురం, శ్రీనివాసపురం, వివేక్‌నగర్, వెంకట్‌రెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉప్పల్ నియోజకవర్గ ఏ–బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు భారత్ జోడో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ చేపట్టనున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. పేదలకు మేలు చేయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ఆర్థిక విధానాలను ఆయన దుయ్యబట్టారు. దేశం, రాష్ట్రం బాగుండాలంటే మోడీ, కేసీఆర్ పాలనను అంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. టీపీసీసీ ప్రతినిధులు మేకల శివారెడ్డి, మహ్మద్ తోఫిక్, పసూల ప్రభాకర్‌రెడ్డి, కంది ఆగిరెడ్డి, రఫీక్, గిరిబాబు, శంకర్, మురళీగౌడ్, జలీల్ పాషా, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.



రామంతాపూర్‌లో జోడో యాత్ర

ఘనంగా రమాబాయి అంబేడ్కర్ జయంతి

అల్వాల్: అల్వాల్‌లో మంగళవారం టీజేఎస్ నాయకులు రమాబాయి అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టీజేఎస్ నాయకులు దయాకర్, రవికుమార్, విష్ణుమూర్తి, శ్రీనివాస్‌చారి, పవన్‌కుమార్, పాషా తదితరులు ఉన్నారు.



అల్వాల్‌లో రమాబాయి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీజేఎస్ నాయకులు

వాహనాల దొంగ అరెస్టు

మల్కాజిగిరి: పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో వాహనాల దొంగతనానికి పాల్పడుతున్న వ్యక్తిని మల్కాజిగిరి పోలీసులు అరెస్టు చేశారు. మల్కాజిగిరి జోన్ డీసీపీ డి.జానకి, ఏసీపీ పి.నరేష్‌రెడ్డి వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా కుల్చారం గ్రామానికి చెందిన గుడాల తిరుమల్(27) మల్కాజిగిరి యాదవనగర్‌లో నివాసముంటూ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. సులభంగా డబ్బులు సంపాదించడానికి వివిధ ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు, ఆటోలను చోరీ చేసి విక్రయించేవాడు. వచ్చిన డబ్బులతో స్నేహితులతో కలిసి జల్సాలు చేసేవాడు. రాచకొండ, సైబరాబాద్, హైదరాబాద్ కమిషనరేట్ జగిత్యాల జిల్లా పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో 26 చోరీలు చేశాడు. ఈ నెల 3వ తేదీన బీజేఆర్‌నగర్‌కు చెందిన సాయికిరణ్ తన హోండా యాక్టివా చోరీకి గురికావడంతో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసిన పోలీసులు తిరుమల్‌ను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రెండు ఆటోలు, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ జగదీశ్వర్‌రావు, ఎస్ఐ కృష్ణమల్, సిబ్బంది వెంకట్‌రెడ్డి, బాలకృష్ణ, సురేందర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ జానకి



స్వాధీనం చేసుకున్న ఆటోలు

అన్నపూర్ణ కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఈస్ట్ అన్నపూర్ణ కాలనీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడి వై.భానుచందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కటార్ల శేఖర్‌బాబు, కోశాధికారి వైకుంఠం, ఉపాధ్యక్షుడు ఎండీ. ముబీన్, యాదగిరిచారి, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌రావు, కల్చరల్ సెక్రటరీ సాజిద్, కార్యనిర్వాహక కార్యదర్శులు శ్రీశైలం, ప్రదీప్ సాహో, లోకల్ అడ్వయిజర్ రవికుమార్, సలహాదారులుగా పీఎస్ ఎన్.చౌదరి, శ్రీకాంత్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, ఆంజనేయులు, యాదగిరి కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి ఎజెండాగా పని చేస్తామన్నారు. వరుసగా ప్రధాన కార్యదర్శిగా కటార్ల శేఖర్ బాబు నాలుగోసారి ఎన్నికయ్యారు.

